నేడు వనస్థలిపురం పార్కుల్లో సునీతారెడ్డి మార్నింగ్ వాక్

వనస్థలిపురం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సోమవారం ఉదయం బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం డివిజన్లలోని పార్కుల్లో వాకర్స్‌తో సమావేశమవుతారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఎన్జీఓస్‌కాలనీలోని వివేకానంద పార్క్ లో, ఉదయం 7 నుంచి 8 గంటల వరకు వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని పార్క్‌లో వాకర్స్‌తో మాట్లాడి మార్నింగ్ వాక్ చేస్తారని వారు తెలిపారు.

అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడికి ఉగాది పురస్కారం



మార్గం రాజేశ్‌కు ఉగాది పురస్కారం అందజేస్తున్న వేణుగోపాలాచారి

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన ఎలెవేట్స్ ఎలైట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని హిమాయత్ నగర్‌లోని వాసవి శ్రీముఖ్ ఆడిటోరియంలో ఉగాది వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులను సన్మానించారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ మాజీ సభ్యుడు సముద్రాల వేణుగోపాలాచారి చేతుల మీదుగా ఉగాది పురస్కార్- 2024ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎలెవేట్స్ ఎలైట్ సంస్థ వ్యవస్థాపకుడు, వైస్ ప్రెసిడెంట్ రవి కిషోర్ ప్రముఖ వ్యాపారవేత్త ఎల్‌పీ రావు, ప్రముఖ షూటర్ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నీడ ఉండదు.. బస్సులు ఆగవు

- స్టాప్ ఉన్నచోట షెల్టర్ కరువు- షెల్టర్ ఉన్నచోట బస్సులు ఆగవు !
- ఎండలోనే ప్రయాణికుల అవస్థలు
- చంపాపేట ప్రాంతంలో వింత పరిస్థితి
- పట్టించుకోని ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు



చంపాపేట చౌరస్తాలో బస్సులు ఆగే చోట షెల్టర్ లేక ఎండలోనే నిలబడ్డ ప్రయాణికులు



చంపాపేట శ్మశానవాటిక ముందు నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

చంపాపేట: వేసవి ఎండల తీవ్రత కారణంగా ఉదయం 8 గంటలు దాటితే ఇంటి నుంచి అడుగు బయట పెట్టేందుకు బెంబేలెత్తుతున్న ప్రయాణికులు ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నానా అవస్థలు పడుతున్నారు. చంపాపేట ప్రాంతంలో బస్టాప్‌లు ఉన్న చోట షెల్టర్లు లేవు.. షెల్టర్లు ఉన్న చోట బస్సులను ఆపడం లేదు. ఈ నేపథ్యంలో ఎండలో మాడుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. బస్‌షెల్టర్లు లేకపోవడంతో రహదారుల పక్కన, షాపింగ్ కాంప్లెక్స్ మాటున, సమీపంలోని చెట్ల కింద బస్సుల రాకకోసం కళ్లు కాయలు కాసేటట్లు ఎదురు చూడాల్సి వస్తోంది.

భైరాములగూడ చౌరస్తా నుంచి ఐఎస్ సదన్ మార్గంలో...

భైరామల్‌గూడ, కర్మన్‌ఘాట్, చంపాపేట, వడ్డెర బస్తీ చౌరస్తా, సాయిరాంనగర్ ఆర్చ్ సమీపంలో షెల్టర్లు లేకపోవటంతో నడి రోడ్డుపైనే ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రయాణికులు నిలుచున్న ప్రాంతానికి సుమారు వంద, రెండు వందల మీటర్ల దూరంలో బస్సులు ఆగుతున్నాయని, దీంతో తమకు ఉరుకులు పరుగులు, ట్రాఫిక్‌లో ప్రమాదాలు తప్పడం లేదని స్థానిక కాలనీ వాసులు వాపోతున్నారు.

- గ్రీన్‌పార్క్ కాలనీ ఆర్చ్, చంపాపేట హరిజన శ్మశానవాటిక, గాయత్రీనగర్ చౌరస్తాల్లో బస్సు షెల్టర్లు ఉన్నప్పటికీ స్టాప్‌కు అటో.. ఇటో అర కిలో మీటరు దూరంలో బస్సులను నిలుపుతున్నారని ప్రయాణికుల ఆర్టీసీ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- చంపాపేట మోడల్ మార్కెట్, కర్మన్‌ఘాట్ చౌరస్తాల్లో గతంలో బస్‌షెల్టర్లు ఉండేవి, వ్యాపార కేంద్రాలకు అడ్డుగా ఉన్నాయనే కారణంగా వాటిని తొలగించటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు.
- మీర్‌పేట, అల్మాస్‌గూడ, జిల్లెలగూడ, కటకోనికుంట, పోచమ్మగడ్డ వంటి పలు కాలనీ వాసులు నెహ్రూనగర్ కాలనీ క్రాస్ రోడ్‌లోని రిక్వెస్ట్ బస్టాప్ వద్ద బస్‌ల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఇక్కడ షెల్టర్ లేకపోవటంతో ఎండలోనే నిలబడాల్సిన దుస్థితి ఉంది.
- చంపాపేట చౌరస్తాకు నిత్యం చుట్టుపక్కల సుమారు 50 కాలనీల ఉద్యోగులు, విద్యార్థులు, నగరానికి ఇతర పనుల కోసం వెళ్లే ప్రయాణికులు చేరుకుంటారు. అక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో చౌరస్తాలోని డీమార్ట్ ముందు మండే ఎండలోనే నిలబడుతున్నారు.
- ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ, ఆర్‌టీసీ అధికారులుసమన్వయంతో వ్యవహరించి అవసరమైన చోట బస్టాప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు స్టాప్ పాయింట్లలోనే బస్‌లు ఆపేలా చర్యలు చేపట్టాలని స్థానిక కాలనీవాసులు, ప్రయాణికులు కోరుతున్నారు. లేని పక్షంలో రాస్తారోకో చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ఎండలో పడిగాపులు



ప్రయాణికులు బస్సు కోసం వేచి చూసే చోట స్టాప్‌లు ఉండవు...ఉన్నా ఆ ప్రాంతంలో బస్సులు ఆగవు. స్టాప్‌కు చాలాదూరంలో నడిరోడ్డుపై బస్సులు ఆపుతున్నారు. ప్రయాణికులు ముందు వెనుక చూసుకోకుండా ఆందోళనతో ఉరుకులు పరుగులు పెడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. చంపాపేట ప్రాథమిక పాఠశాల, ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో బస్టాప్ ఏర్పాటు చేసి నెల తిరగకుండానే తొలగించారు. ఆ స్టాపులను తిరిగి ఏర్పాటు చేయాలి.
– బానుక రమేష్, నేతాజీనగర్

అవసరమైన చోట స్టాప్‌లు ఏర్పాటు చేయాలి



వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని డీఎంఆర్‌ఎల్ చౌరస్తా నుంచి భైరామల్‌గూడ అలేఖ్య టవర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కనీసం ఐదు బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేయాలి. అప్పుడే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. చంపాపేట హరిజన శ్మశాన వాటిక ముందు ఏర్పాటు చేసిన స్టాప్‌కు ప్రయాణికులు రావడం లేదు. అలాంటి చోట కాకుండా ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంలో స్టాప్‌లు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.
– పాశం శ్రీశైలం, చంపాపేట

ఇఫ్తార్ విందులతో మత సామరస్యం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న

వనస్థలిపురం: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి దోహదం చేస్తాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని గురుద్వార్ రోడ్డులో బీఆర్‌ఎస్ నాయకుడు ముదబీర్ ఖాన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్ రెడ్డి, ముద్దగౌని లక్ష్మీప్రసన్న, నాయకులు చింతల రవికుమార్, జగన్‌గౌడ్, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, రామ్మోహన్, పలువురు నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్: ఎమ్మెల్యే బలాల



విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల, బస్వరాజ్ గౌడ్ తదితరులు

మలక్‌పేట: ఇఫ్తార్ విందులు హిందు ముస్లింల ఐక్యతను చాటుతాయని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారంలో లింగాల బస్వరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఉత్సవాలు, పర్వదినాలు, పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగాల శ్రీనప్పగౌడ్, గొట్టిపర్తి సురేష్‌గౌడ్, రంగా విక్రమ్‌గౌడ్, మహ్మద్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న వనస్థలి క్రాంతి లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలి క్రాంతి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సమీపంలోని హుడా పార్క్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు మధుమేహం, బీపీ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ లయన్ సాధు శ్యాంప్రసా ద్, వనస్థలి క్రాంతి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వాసుదేవరావు, ఎస్.లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎస్.మహేష్ కుమార్, డా.ఎం.రామచంద్రరావు, సంధ్యారాణి, వీరప్ప, వెంకటస్వామి, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార బాధ్యతలు అప్పగింత



అఫ్జల్ అహ్మద్

పహాడీషరీఫ్: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ మైనార్టీల ప్రచార బాధ్యతలను బాలాపూర్‌కు చెందిన సయ్యద్ అఫ్జల్ అహ్మద్‌కు అప్పగించారు. ఆదివారం ఆలిండియా మైనార్టీ సెల్ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ఆయనను నియమించారు. అనంతరం అఫ్జల్ అహ్మద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని మైనార్టీలను ఏకతాటి పైకి తీసుకొచ్చి పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి విజయంలో కీలక పాత్ర పోషించేలా కృషి చేస్తానన్నారు.

ఆసుపత్రిలో నర్సు ఆత్మహత్య

చైతన్యపురి: స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న యువతి ఆసుపత్రి గదిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ప్రియ మొండల్ (23) సరూర్‌నగర్‌లోని సాయి తేజ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తోంది. ఆదివారం డ్యూటీ లేకపోవటంతో అదే ఆసుపత్రిలోని గదిలో విశ్రాంతి తీసుకుంటోంది. సాయంత్రం తోటి నర్సు గదికి వచ్చి తలుపు తట్టగా తీయలేదు. దీంతో ఆసుపత్రి సిబ్బందిని పిలిచి తలుపు గడియ పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు చీర, టవల్‌తో ఉరి వేసుకుని చనిపోయి ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రియ మొండల్ ఈ మధ్య రాసిన టెస్ట్‌లో క్వాలిఫై కాకపోవటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



కొహెడలో ప్రచారం చేస్తున్న బూర నర్సయ్య గౌడ్

తుర్కయంజాల్: బీజేపీ తోనే దేశాభివృద్ధి సాధ్యమని భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉమర్‌ఖాన్ గూడ, కొహెడ, బ్రాహ్మణపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం కౌన్సిలర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్ ఇంటికి వెళ్లి టిఫిన్ చేశారు. సాయంత్రం బ్రాహ్మణపల్లి చౌరస్తా నుంచి తుర్కయంజాల్ వరకు ఆయన ప్రచారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నోముల దయానంద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, బచ్చిగళ్ల రమేశ్, దాసరి మల్లేశ్, సానెం అంజయ్య, కొత్త రాంరెడ్డి పాల్గొన్నారు.

టెట్ మినహాయింపు ఇవ్వాలి

పోస్ట్‌కార్డు క్యాంపెయిన్ ద్వారా సీఎంకు వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ వరకాల పరమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని ఉపాధ్యాయులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వరకాల పరమేశ్ మాట్లాడుతూ నియామకమైన నాటి నుంచి సుమారు 20, 30 సంవత్సరాలు విధులు నిర్వహించారని, వారికి ప్రమోషన్లు కల్పించకుండా నిబంధనల పేరుతో ఇబ్బందులు కలిగించడం బాధాకరమన్నారు. తమ సర్వీస్‌ను పూర్తి చేసుకొని రిటైర్డ్ అవ్వుతున్న సందర్భంలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అడ్డంకిగా మారిందన్నారు. ఈ విషయంలో వారికి మినహాయింపు ఇచ్చి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజు, చంద్రశేఖర్, గోవర్ధన్, మల్లేశ్, వెంకటేశ్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని సంరక్షించుకుందాం



సహారాస్టేట్స్ కాలనీలోని నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్ తదితరులు

మన్సూరాబాద్: తాగునీటి వృథాను అరికట్టి, నీటిని సంరక్షించుకునే ప్రక్రియలో భాగస్వాములం అవుదామని సహారా స్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సేవ్ వాటర్ . సేవ్ లైఫ్ పేరుతో డివిజన్ పరిధిలోని సహారాస్టేట్స్ కాలనీలో ఆదివారం నీటి వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇంటి ఎదుట కొందరు తమ వాహనాలను నీటితో కడిగి నీటిని వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి నెలకొందని, తాగునీరు లభించక ప్రజలు అల్లాడిపోతున్నారని, విలువైన నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాలనీవాసులు తమ ఇంటి ఎదుట తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు రాఘవేందర్, జగత్ రెడ్డి, జ్ఞానేశ్వర్, రాపోలు విశ్వనాథ్, కరుణాకర్‌రెడ్డి, శ్యామ్, కృష్ణమోహన్, సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ కులాల ఐక్యవేదిక డిమాండ్



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

నాగోలు: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. కొత్తపేటలో ఆదివారం కొత్తపేటలో బీసీ కులాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. సామాజిక తెలంగాణ ఫ్రంట్ చైర్మన్, ఏఐసీసీ వార్ రూమ్ సభ్యుడు వెన్నుపూజ పరశురాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దపూర బ్రహ్మయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో బ్రహ్మయ్య మాట్లాడుతూ, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ కుల గణన చేపట్టాలని, ఉద్యోగ ప్రమోషన్‌లో రిజర్వేషన్ కల్పించాలని, బీసీ సబ్ ప్లాన్ కింద పది లక్షల కోట్లు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న సబ్సిడీ రుణాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలి, ఖాళీగా ఉన్న ఫెడరేషన్లకు చైర్మన్లను నియమించాలని, విద్యా వైద్య రంగాల్లో బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా వెన్నుపూజ పరుశరాజ్, ప్రధాన కార్యదర్శిగా పగడాల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా మద్దెల వినయ్ కుమార్, కోశాధికారిగా పున్నం రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాగం సుభాష్ యాదవ్, స్టేట్ యూత్ అధ్యక్షుడిగా మల్లేష్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడి శ్రీరాములు, సంగారెడ్డి అధ్యక్షుడిగా విట్టల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలిగా చైతన్య, జనరల్ సెక్రెటరీగా మాధురి, వైస్ ప్రెసిడెంట్‌గా రేణుకను ఎన్నుకున్నారు. నాయకులు మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రవేశాలు లేని విద్యా సంస్థలను బహిష్కరించాలి



పూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాల గోడపత్రికను వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. హస్తినాపురం చౌరస్తాలో ఈనెల 11న మహాత్మాజ్యోతిరావు పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు, అంబేద్కర్ విగ్రహ వ్యవస్థాపక అధ్యక్షుడు నందిగామ వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, అంతర్జాతీయ ప్రమాణాలతో అందరికీ సమాన విద్య అందించాలన్నారు. పేదలకు ప్రవేశాలు లేని పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ యూనివర్సిటీలను బహిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో అన్నపోసల వెంకటేశ్, బొమ్మరఘురామ్ నేత, ఎస్.దుర్గయ్యగౌడ్, డాక్టర్ సత్యప్రకాశ్, రాపోలు లింగస్వామి, రామస్వామి, సతీష్‌కుమార్, యోగేశ్‌యాదవ్, ఎర్రోళ్ల వెంకటేశ్, గణేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 17, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 32, బీర 35, క్యాలీఫ్లవర్ 19, క్యాబేజీ 19, క్యారెట్ 23, దొండ 18, ఆలు 32, ఉల్లి 22, గోకర 23, దోస 15, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్‌రూట్ 19, కీర 22, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ 65. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కర్మన్‌ఘాట్ గౌడ సంఘం అధ్యక్షుడిగా సుదర్శన్ గౌడ్



చైతన్యపురి: కర్మన్‌ఘాట్ గౌడ సంఘం అధ్యక్షుడిగా చేగోని సుదర్శన్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారం రోజుల క్రితం అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసి ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో గ్రామపెద్దలు, యువకులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ, గౌడ కులస్తుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో అడ్‌హాక్ కమిటీ సభ్యులు పాలెం భిక్షపతి గౌడ్, సురిగి పెంటయ్య గౌడ్, ఎరుకల రాజు గౌడ్, చేగోని విఠల్‌గౌడ్, గొరిగె బాబు గౌడ్, రమేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు గెరిగె సురేష్ గౌడ్, సభ్యులు లోతుకుంట రగుపతి గౌడ్, చేగోని అశోక్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహలో గంజాయి కలకలం

నాగోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

నాగోలు: నాగోలు పరిధిలోని బండ్లగూడ రాజీవ్ స్వగృహ (సహభావన అపార్ట్‌మెంట్‌లో నాలుగు రోజుల క్రితం కొత్త మంది యువకులు గంజాయి సరఫరా చేస్తుండగా ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, నాగోలు పోలీసులు దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురు యువకులపై ఎస్ఓటీ పోలీసులు కేసులు నమోదు చేసినట్టు తెలిసి నాగోలు పోలీసులను ఆరా తీయగా సమాచారం ఇచ్చేందుకు అప్పట్లో నిరాకరించారు. అయితే, ఆదివారం రాత్రి పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్న వీడియో సోషల్ మీడియాలో రావడంతో నాగోలు పోలీసులు స్పందించారు. ఇది గతంలో జరిగిందని, ఎస్ఓటీ పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

నాగోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై నాగోలు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుత్బుల్లాపూర్‌కు చెందిన మల్లికార్జున ఆదివారం తన కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు కిరాణా దుకాణంపై దాడి చేసి 13 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం



తైక్వాండో బెల్ట్, సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శరీరక ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణకు తైక్వాండో దోహదపడుతుందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ నేతృత్వంలో గంఘాన్ తైక్వాండో ఆధ్వర్యంలో బెల్ట్ ప్రమోషన్ కార్యక్రమాన్ని మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని యోగా షెడ్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్‌తో పాటు టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు ఏ రంగంలో ఆసక్తి కనబరుస్తున్నారో గుర్తించి అందులో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, వేమన్‌రెడ్డి, నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, వెంకటసాయి, హనోక్ నాయుడు, మణిదీప్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



అబ్దుల్లాపూర్‌మెట్: జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు చదువుకొని 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలు, తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యుల క్షేమసమాచారం ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు యాదయ్య, నరేందర్, శ్యామ్, మురళీ, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, మంగ, మంజులా, వనజ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్‌బ్యాంక్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి



ప్రధాన కార్యదర్శి రాకేష్‌సింగ్

మన్సూరాబాద్: సెంట్రల్‌బ్యాంక్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం కాలనీ కమ్యూనిటీహాల్‌లో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కిడి తిరుమల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా భైరవరెడ్డి, విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా ఠాకూర్ రాకేష్‌సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణప్రసాద్, జాయింట్ సెక్రటరీగా హరీష్‌రెడ్డి, కోశాధికారిగా డీజే గోవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే, కార్యవర్గ సభ్యులుగా మధుసూదన్‌రెడ్డి, సురేష్‌కుమార్‌గౌడ్, మనోహర్ రెడ్డి, విఠల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, జె.మధుసూదన్‌రెడ్డి, సలహాదారులుగా వినోద్‌ప్రసాద్, గోపాలకృష్ణమూర్తి, కోటిరెడ్డిలను ఎన్నికయ్యారని నూతన అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి తెలిపారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం: టీపీయూఎస్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీయూఎస్ అధ్యక్షుడు అజయ్ కార్తీక్

చంపాపేట: రాష్ట్రంలోని ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే టీపీయూఎస్ లక్ష్యమని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు అజయ్ కార్తీక్ అన్నారు. ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని ఉపాధ్యాయ సంఘ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సంఘ నూతన విద్యా సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ...ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉన్నత విద్యార్హత, బోధనా నైపుణ్యం ఉన్నప్పటికీ పనికి తగ్గ వేతనం లభించక ఆర్థిక ఇబ్బందులతో పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ప్రైవేట్ ఉపాధ్యాయునికి ప్రభుత్వం ఇందిమ్మ ఇల్లు, రేషన్, హెల్త్ కార్డులు అందించటంతో పాటు ఉద్యోగ భద్రత, ఏడాదిలో పన్నెండు నెలల పాటు వేతనం ఇచ్చే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘ నేతలు సందీప్‌రావు, ఇస్మాయిల్, వైఎస్‌పీ రఘురామ్ జగన్‌బాబు, రాజేష్, సిద్ధిరాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.